

దోషులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన మానవ విలువలకే మాయని మచ్చ. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపడంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలి. మహిళా వైద్యుల రక్షణకు సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనలను కచ్చితంగా అమలు చేయాలి. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పాలకులు చట్టాలు చేయడం చాలా అవసరం.

– డాక్టర్ రామ్ భాస్కర్, వైద్యాధికారి, రాజానగరం పీహెచ్‌సీ



ప్రత్యేక చట్టాలు అవసరం



వైద్యురాలిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుండగులను పట్టుకోవడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందో తెలియడం లేదు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేవరకు వైద్యరంగం అండగా నిలవాలి. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేకంగా చట్టాలు చేయాలి.

– డాక్టర్ జి.విజయలక్ష్మి, వైద్యురాలు, కొంకుదురు పీహెచ్‌సీ

క్లుప్తంగా

ఈ-క్రాప్‌తో అనేక ప్రయోజనాలు

మధురపూడి: ఉద్యానవన రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని, దానివల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆ శాఖ కోరుకొండ మండలాధికారి రినీ అన్నారు. మండలంలో 3,300 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవనాలున్నాయన్నారు. ఈ-క్రాప్ ద్వారా పంటనష్ట పరిహారం, ప్రభుత్వం కల్పించే రాయితీలను పొందవచ్చని తెలిపారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామానికి చెందిన కొపర్తి గణేష్ కుమార్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం రూ.కోటి చెక్కును అందించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా ఇండస్ట్రీలో బుధవారం జరిగిన ప్రమాదంలో గణేష్ కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎక్స్‌గ్రేషియాగా వచ్చిన కోటిరూపాయలను ఎమ్మెల్యే వారికి అందించారు. కార్యక్రమంలోని ఆర్డీవో కె.శివజ్యోతి, తహసీల్దార్ వై.లక్ష్మీరమణి, డీటీ కృష్ణ, కొప్పవరం మాజీ సర్పంచి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా ట్రైనింగ్ ఆన్ ట్రైనర్స్ ప్రోగ్రాం, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్, క్రిస్పాప్పీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. అక్కౌంటింగ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కళాశాలల నుంచి వచ్చిన ట్రైనర్లకు ఇచ్చారు. బీకామ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మాస్టర్ ట్రైనర్ చక్కర రాఘవ్ మాట్లాడుతూ అక్కౌంటింగ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్లకు కావాల్సిన నైపుణ్యాలను వివరించారు.

తపాలా స్టాంపుల సేకరణకు కేంద్ర ప్రోత్సాహం

రాజమహేంద్రవరం సిటీ: తపాలా స్టాంపుల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ స్పర్శ్ పథకం ఏర్పాటు చేసిందని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కోట శేషారావు తెలిపారు. తపాలా స్టాంపులను సేకరించే విద్యార్థులకు ఈ పథకంలో ఉపకార వేతనాలు మంజూరు చేస్తారన్నారు. చదువు ప్రతిభ కనబరుస్తూ స్టాంపులు సేకరించే 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు అందజేయనున్నారు. విద్యార్థులు చదివే పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ ఏర్పాటై ఉండి, దానిలో అతడు సభ్యుడై ఉండాలన్నారు. పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ లేని పక్షంలో వ్యక్తిగతంగా ఫిలాటలీ సభ్యుడై ఉండాలన్నారు. సమీపంలోని తపాల కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, వాటిని పూర్తిచేసి పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం–530017 చిరునామాకు స్పీడ్ పోస్ట్ ద్వారా సెప్టెంబర్ 16వ తేదీలోగా పంపాలని కోరారు.

కొనసాగిన ఉపాధ్యాయుల సర్దుబాటు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ మండల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్ స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. డీవైఈవో నారాయణ, అర్బన్ ఎంఈవో బి.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల సబ్జెక్టులకు అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయించారు. తెలుగు 3, హిందీ 3, ఇంగ్లిష్ 8, గణితం 10, భౌతిక శాస్త్రం 9, జీవశాస్త్రం 12, సాంఘిక శాస్త్రం 20 సబ్జెక్టులకు సర్దుబాటు చేశారు. ఉన్నత పాఠశాలలలోని మొత్తం 65 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో దిలీప్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ పరిధిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కౌన్సెలింగ్ నిర్వహించామని, మిగిలిన పోస్టులకు విద్యాశాఖ ఉన్నత అధికారుల తదుపరి ఆదేశాలను అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సీనియారిటీ విషయంలో సాంకేతిక సమస్య వల్ల కౌన్సెలింగ్ ఆగిపోయిందన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన

కంబాలచెరువు: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'అంతరిక్ష విజ్ఞానం–ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు శ్రీహరి సుధాకర్ మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంతో భారత పురోగతిని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

రహదారిపైనే నిరీక్షణ

- జాతీయ రహదారిపై కానరాని బస్టాప్‌లు
- విద్యార్థుల తీవ్ర అవస్థలు
- బస్సు ఎక్కాలంటే రోడ్డుపై ఉండాల్సిందే
- నన్నయ, గైట్ కళాశాలల వద్ద పరిస్థితి



గైట్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద జాతీయ రహదారిపైనే బస్సు కోసం చూస్తున్న విద్యార్థులు

రాజానగరం: జాతీయ రహదారిని అనుకుని ఉన్న పలు విద్యాసంస్థలలో అనేక మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు ప్రతిరోజూ ఆయా విద్యాసంస్థలకు ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగిస్తారు. కానీ వారు బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాప్‌లు సక్రమంగా లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది. వీరందరూ ప్రతి నెలా నిర్ణీత సొమ్ము చెల్లించి బస్సుపాస్‌లు తీసుకుంటారు. వాటిని వినియోగించుకోవడానికి నానాపాట్లు పడాల్సి వస్తోంది.

జాతీయ రహదారిపై..

జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (గైట్ ఇంజినీరింగ్ కాలేజ్)లలో సుమారు 8,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 2,450 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే విద్యాలయాలకు వచ్చి, వెళుతుంటారు. జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో పైవిద్యాలయాల వద్ద ప్రత్యేకంగా బస్టాప్‌లను ఏర్పాటు చేసి, రహదారికి సబ్‌వేగా జాగాను వదలడంతో బస్సులు ఆ ప్రాంతంలో ఆగేవి.

డివైడర్లు దాటాల్సిందే..

గైట్ కాలేజీ నుంచి నన్నయ యూనివర్సిటీ వరకూ రెండేళ్ల క్రితం రహదారికి ఇరువైపులా సబ్‌వేలను ఏర్పాటు చేశారు. ఈ సమయంలో బస్టాప్‌లను విస్మరించడంతో సమస్య ప్రారంభమైంది. టువేగా ఉన్న ఈ రహదారిపై అవతలి వైపు దిగిన వారు ఇవతలకు రావాలన్నా, ఇటు నుంచి అటు వెళ్లాలన్నా డివైడర్లను దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అయితే సబ్‌వేల ఏర్పాటు సమయంలో గైట్ కాలేజీ వద్ద మూసివేసిన జంక్షన్‌ని తిరిగి పునఃరుద్ధరించారు. కానీ విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు వీలుగా బస్టాప్‌లను ప్రారంభించలేదు. ఇక నన్నయ యూనివర్సిటీ వద్ద పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఇక్కడ జంక్షన్ లేకపోవడంతో యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులు అటువైపు బస్సు దిగి ఇటు వైపు రావాలంటే డివైడర్‌ని దాటాల్సిందే.

బస్టాప్‌లు ఏర్పాటు చేయాలి



గైట్ కాలేజీ నుంచి నన్నయ యూనివర్సిటీ వరకు వేసిన సబ్‌వేలలోనే ఆ చివర, ఈ చివర బస్టాప్‌లను ఏర్పాటు చేయడం విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అలాగే నన్నయ యూనివర్సిటీ వద్ద రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోనూ బస్టాప్ నిర్మించాలి. అక్కడ బస్సులు దిగిన విద్యార్థులు యూనివర్సిటీలోకి వచ్చేందుకు అవసరమైన మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలి.

– అశ్రిత్ దినేష్‌వర్మ, నన్నయ వర్సిటీ విద్యార్థి

రహదారిపైనే నిరీక్షణ



గైట్ కాలేజ్ వద్ద జాతీయ రహదారిపై జంక్షన్ ఉంది. కానీ రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో సబ్‌వే పొడవునా ఐరన్ గ్రిల్స్ వేశారు. దీంతో ఆ దారిలో బస్సుల కోసం నిరీక్షించే వారంతా రహదారిపైనే ఆగాల్సి వస్తోంది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పడం లేదు. ఇక్కడ సబ్‌వే వైపుకు వెళ్లేందుకు మార్గానిచ్చి, అదే ప్రాంతంలో బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

– జాజిమొగ్గల విశాలాక్షి, బీటెక్, విద్యార్థిని

రాజానగరంలో విద్యార్థినుల ర్యాలీ



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

రాజానగరం: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ స్థానిక దివ్య కాలేజీ విద్యార్థినులు గ్రామంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఆధునిక సమాజంలో ఆడవారిపై పెరిగిపోతున్న దాడులను అరికట్టాలని, మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కాలేజీ నుంచి ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



పందలపాకలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి



సీతానగరం హైస్కూల్లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సతీష్‌బాబు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తాము రూపొందించిన రాకెట్ల మోడళ్లు, పోస్టర్లను ఉత్సాహంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం వీసీ జాకబ్, సైన్స్ ఉపాధ్యాయులు ఓం ప్రసాద్, భారతి మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రుడిపై కాలు మోపిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 23ను నేషనల్ స్పేస్ డేగా జరుపుకొంటున్నామన్నారు.

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ద్వారా ప్రయోగించిన వివిధ లాంచింగ్ వెహికల్స్ గురించి వివరించారు. మనదేశం అంతరిక్ష పరిశోధనలలో అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు కె.సతీష్‌బాబు డిజిటల్ స్క్రీన్‌పై అంతరిక్షం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాజానగరం: అంతరిక్ష పరిశోధనలపై యువత ఆసక్తిని పెంపొందించుకోవాలని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ పరిశోధన అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఎస్ రాజు అన్నారు. అంతరిక్ష సాంకేతికతతో సవాళ్లు అనే అంశంపై శుక్రవారం సెమినార్ జరిగింది. ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వివిధ రకాల ఉపగ్రహ నౌకలు, అవి పనిచేసే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, జీజీయూ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం



పెదపూడిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నమస్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి



కొంకుదురు ఉన్నత పాఠశాలలో..

- కొనియాడిన వక్తలు
- ఘనంగా ఆంధ్రకేసరి జయంత్యుత్సవం

పెదపూడి: ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకాశం పంతులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏట చలమయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.



సీతానగరం కళాశాలలో మాట్లాడుతున్న అధ్యాపకులు

స్ఫూర్తిప్రదాత

బిక్కవోలు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. ఆ పాఠశాలలో శుక్రవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సీతానగరం: టంగుటూరి ప్రకాశం పంతులు వంటి నిస్వార్థ రాజకీయ నాయకుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని సీతానగరం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ అన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో హెచ్‌ఎం వీరభద్రరావు ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు.

ముత్యాల పల్లకిలో వధూవరులు



రఘుదేవపురంలో ముత్యాలపల్లకిలో వధూవరుల ఊరేగింపు

సీతానగరం: పెళ్లి వేడుకలలో ఆధునిక సంప్రదాయాలు వచ్చాయి. కొన్ని పద్ధతులు, ఆచారాలు కనుమరుగయ్యాయి. ఖరీదైన కార్లు, తీన్‌మార్ బ్యాండ్‌లతో ఎంతో అట్టహాసంగా ఊరేగింపులు జరుగుతున్నాయి. అయితే వీటికి భిన్నంగా పాతతరం పద్ధతులు పాటించేవారూ ఉన్నారు. రఘుదేవపురానికి చెందిన మామిడి కుటుంబ సభ్యులు వధూవరులను పల్లకిలో ఊరేగించారు. గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఊరేగింపును ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు. నాటి ఆచారాలను పాటిస్తున్న మామిడి కుటుంబానికి అభినందనలు తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

రాజానగరం: చెడు వ్యవసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హితవు పలికారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం 'ర్యాగింగ్, ఆల్కాహాలిసమ్, డ్రగ్ అబ్యూస్' అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. తొలుత ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరదాగా ప్రారంభమయ్యే చెడు అలవాట్లు రానురాను జీవితాలను నాశనం చేస్తాయన్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్‌కి తావులేకుండా చక్కటి వాతావరణంతో ఉందన్నారు. దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ ఉన్నత సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన మన దేశంలో ర్యాగింగ్ చట్టాలను తీసుకురావడానికి గల కారణాలను, పరిస్థితులను వివరించారు. న్యూరాలజీ వైద్యనిపుణులు డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ కొందరు యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావడంతో వారి నూరేళ్ల జీవితాలు మధ్యలోనే ముగిసిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.ఉదయ్ భాస్కర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కెజియారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

విజయదుర్గమ్మకు అభిషేకాలు

పెదపూడి: సంపరలో కొలువైన విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసంలో మూడో శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు లలితా పారాయణ చేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



రంగంపేటలోని విజయ దుర్గాంబిక



తొస్సిపూడిలో నవదుర్గమ్మ



పందలపాకలో..

బిక్కవోలు: శ్రావణ మాసంలోని మూడో శుక్రవారం సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. వ్రతం ఆచరించిన మహిళలు తరలిరావడంతో సాయంత్రం వేళల్లో రద్దీ ఏర్పడింది. బిక్కవోలులో పార్వతీదేవి, పందలపాకలో కట్లమ్మ తల్లి, తొస్సిపూడి నవదుర్గమ్మ, కొమరిపాలెం కనకదుర్గ, ఊలపల్లి దుర్గమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలు బలరామకృష్ణ, రామకృష్ణారెడ్డి



బూరుగుపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



పెద్దాడ గ్రామ సభలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అన్నామణి



వడిశలేరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నం

మధురపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతుల కల్పన, రక్షిత నీరందించడం, పరిశుభ్రతకు కృషి చేస్తామన్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, కార్యక్రమంలో సర్పంచ్‌లు ముడే సింధూ దివ్య, కడియాల పాపారావు, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధిహామీ సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్‌లు అధ్యక్షత వహించారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పెదపూడి: గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) టి.అన్నామణి అన్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయడానికి సభలు నిర్వహించారు. పెద్దాడ గ్రామ సభలో డీఎల్‌పీఓ అన్నామణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ గ్రామ పంచాయతీలే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. 2024 –25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల వారీగా చేపట్టే ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభలో చర్చించారు.

పెదపూడి: అనపర్తి మండలం మహేంద్రవాడలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం సిద్ధించాలని, స్థానిక సంస్థలు బలోపేతం కావాలన్నారు.

సీతానగరం: రఘుదేవపురం సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి పనులపై చర్చించారు.

రాజానగరం: గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందడం కోసమే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా 2024–25 సంవత్సరంలో చేపట్టబోయే పనులకుగాను ప్రతిపాదనలు తయారుచేసేందుకు మండలంలో గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా కానవరంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

రంగంపేట: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయని ఎంపీడీఓ పి.వెంకటరత్నం తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సభలలో స్వర్ణ గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసే ఉద్దేశంతో మరో నాలుగు అంశాలను నిర్దేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న పాల్గొన్నారు.